క్లుప్తంగా...

దరఖాస్తుల ఆహ్వానం

కుషాయిగూడ: ప్లాస్టిక్ ఉత్పత్తుల తయారీలో కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ(సీపెట్) శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులకు ఆహ్వానం పలుకుతోంది. 2023–24 విద్యా సంవత్సరానికిగానూ డిప్లొమా, పోస్టు డిప్లొమా, పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా కోర్సుల్లో శిక్షణ ఇచ్చేందుకు నోటిఫికేషన్ జారీ చేసింది. పదో తరగతి, మెకానికల్ డిప్లొమా, బీఎస్సీ విద్యార్హత కలిగిన వారు ఈ కోర్సులకు అర్హులని ఆసక్తి గల వారు ఫోన్ 9677256436, 8093140230 నెంబర్లలో సంప్రదించాలని సంస్థ ప్రతినిధులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు ఉచిత శిక్షణతో పాటు ఉచిత వసతి సౌకర్యం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ పూర్తయిన తర్వాత ప్లాస్టిక్ అనుసంధాన సంస్థలో ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు వెల్లడించారు.

జన్మదిన వేడుకలు



మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి పోశం రాజు యాదవ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి నివాసంలో ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు.

మౌలాలిలో కాంగ్రెస్ నేతల పాదయాత్ర

మౌలాలి: మౌలాలి డివిజన్ ఎంజే కాలనీలో బుధవారం కాలనీ నేస్తం – కాంగ్రెస్ హస్తం పేరుతో డీసీసీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ ఆధ్వర్యంలో పాదయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మల్కాజిగిరిలో కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధే ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్‌యాదవ్, వంశీ ముదిరాజ్, కిరణ్, నాగేష్, బాలరాజుగౌడ్, హమీద్, హైదర్, నర్సింహ, నాగరాజుగౌడ్, చంద్రకళ, భాగ్యరాణి, యశోదమ్మ, నిర్మల, ఆశ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ భర్తపై కేసు నమోదు

మేడిపల్లి: ఓ ప్లాటు వివాదంలో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 3వ డివిజన్ బీఆర్ఎస్ నేత, కార్పొరేటర్ భర్త బైటింటి ఈశ్వర్‌రెడ్డిపై కేసు నమోదైన ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 3వ డివిజన్ పర్వతాపూర్ సాలార్జింగ్ కంచె సత్యనారాయణపురంలోని ప్లాట్ నెంబర్ ఈ–211లో గల 320 గజాల తన ప్లాట్‌ను బీఆర్ఎస్ నేత కబ్జా చేస్తున్నాడని ఉప్పల్ ప్రాంతానికి చెందిన శ్రీనివాస్ రెడ్డి మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బోగస్ పత్రాలతో ఈశ్వర్‌రెడ్డి తన ప్లాట్‌లోకి అక్రమంగా చొరబడి ప్రహరీని కూల్చి అందులో బోరు వేయడంతో పాటు కబ్జాలో ఉంటూ తనను భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని అతడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. తనకు ప్రాణహాని ఉందని, ఈ విషయంలో తనకు న్యాయం చేయాలని మేడిపల్లి పోలీసులను వేడుకున్నాడు. మేడిపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని పూర్తి దర్యాప్తు చేస్తున్నట్లు మేడిపల్లి సీఐ గోవర్ధన గిరి తెలిపారు.

ఉచితంగా నీళ్లు అని చెప్పి బిల్లుల వసూలా..?

శామీర్‌పేట్: ఉచిత నీటి సరఫరా అని చెప్పి బిల్లులు వసూలు చేయడం మంత్రి అసమర్థ పాలనకు నిదర్శనమని టీపీసీసీ అధికార ప్రతినిధి హరివర్ధన్‌రెడ్డి అన్నారు. తూంకుంట మున్సిపాలిటీలో నల్లా బిల్లుల రద్దుకు బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రమంతటా ఉచితంగా నీటిని సరఫరా చేస్తున్నామని గొప్పలు చెప్పుకునే సీఎం కేసీఆర్, ప్రస్తుతం మున్సిపాలిటీల్లో నల్లా బిల్లులు ఎందుకు వసూలు చేస్తున్నారని ప్రశ్నించారు. అనంతరం తూంకుంట మున్సిపాలిటీ కార్యాలయం నుంచి హెచ్ఎండబ్ల్యూఎస్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, వినతి పత్రాన్ని అందజేశారు.

పంది మాంసంతో నూనె

సాక్షి, సిటీబ్యూరో: పంది మాంసం వ్యర్థాలతో ఆయిల్ తయారు చేసి విక్రయిస్తున్న నిందితుడిని రాచకొండ పోలీసులు అరెస్టు చేశారు. మల్కాజిగిరి స్పెషల్ ఆపరేషన్ టీం(ఎస్ఓటీ) పోలీసుల వివరాల ప్రకారం.. నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆర్కేపురంకు చెందిన రమేష్ శివ పంది కొవ్వు నుంచి నూనె తయారు చేస్తున్నాడు. దీన్ని స్థానికంగా ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వాహకులకు విక్రయిస్తున్నాడు. అలాగే కొంత మంది రైతులు దీన్ని తీసుకువెళ్లి వస్త్రాలకు పోసి పంటకు రక్షణగా ఇతర జంతువులు రాకుండా కట్టడానికి తీసుకెళ్తున్నారు. ఈమేరకు విశ్వసనీయ సమాచారం అందుకున్న మల్కాజిగిరి ఎస్ఓటీ పోలీసులు రమేష్ ఇంటిపై ఆకస్మికంగా దాడి చేశారు. నిందితుడి నుంచి 15 లీటర్ల కల్తీ నూనెను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం నిందితుడిని నేరేడ్‌మెట్ పోలీసులకు అప్పగించారు.



కల్వర్టు పాతగోడపై ఎత్తును పెంచుతూ నిర్మించిన గోడ

నిర్లక్ష్యాన్ని ఏమనాలా..?

- ఓ కల్వర్టు నిర్మాణం రూ.33 లక్షల్లో పూర్తి
- గాంధీనగర్ కల్వర్టుకు రూ.60 లక్షలు
- లక్షల రూపాయలు నాలాలో పోస్తున్నా.. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు
- ఎవరి వాటా ఎంత..? స్థానికుల ఆగ్రహం

పాత నిర్మాణంపైనే కొత్త కల్వర్టు నిర్మాణం

తిలా పాపం.. తలా పిడికెడు.. అన్న తీరుగా మారింది అధికారులు, కాంట్రాక్టర్ల వ్యవహారం.. అడిగినంత ముడితే చాలు ఎవరెటుపోతే తమకేమీ అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ప్రాణాలు తీసేలా నిర్మాణాలు కొనసాగుతున్నా అటువైపు కన్నెత్తి చూడని దుస్థితి నెలకొందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కల్వర్టుల నిర్మాణాల్లో ఏ మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించినా కుప్పకూలే అవకాశం ఉంది. ప్రాణాలు గాల్లో కలిస్తే ఎవరు బాధ్యులు..? అంటూ ప్రశ్నిస్తున్నారు. ఏళ్ల క్రితం నిర్మించిన నాలా గోడలపైనే స్లాబ్ వేసి తూతూమంత్రంగా కల్వర్టు పనులు పూర్తి చేస్తున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని అడుగుతున్నారు.

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్‌లో చేపడతున్న అభివృద్ధి పనుల్లో కనీస నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదు. పాతగోడలకు పూతలన్నట్లు పాత నిర్మాణాలపై కొత్త నిర్మాణ పనులు చేపడుతూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. ప్రశ్నించాల్సిన అధికారులే కాంట్రాక్టరుకు వత్తాసు పలుకుతున్న తీరు కంచే చేను మేసిన చందగా మారింది. అధికారుల అండదండలతోనే కాంట్రాక్టర్లు నాణ్యతకు తిలోదకాలిచ్చి పనులు చేస్తున్నారన్న విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. చర్లపల్లి డివిజన్ పరిధిలోని గాంధీనగర్ కాలనీలో రూ.60 లక్షలతో కల్వర్టు నిర్మాణం చేపట్టారు. అయితే ఈ కల్వర్టుపై గతంలో తాత్కాలికంగా వంతెన నిర్మాణం జరిపి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేశారు. కాగా తాత్కాలిక వంతెన నిర్మాణం కోసం వేసిన పాత నిర్మాణాలను పూర్తిగా తొలగించకుండా వాటిపైనే కొత్తగా కల్వర్టు నిర్మాణం చేయడం గమనార్హం.

పాతగోడపైనే స్లాబ్ వేసేందుకు రెడీ..

గతంలో ఉన్న కల్వర్టు వెడల్పు పెంచుతూ నిర్మాణం చేపట్టిన క్రమంలో మధ్యలో ఉన్న గోడను పూర్తిగా తొలగించారు. మరో గోడను కలుపుతూ గోడ నిర్మాణం చేపట్టారు. అంతేగాకుండా పాత



కల్వర్టు పాతగోడను కలుపుతూ నిర్మించిన గోడ

గోడలపై కొద్దిగా ఎత్తు పెంచి స్లాబ్ వేసేందుకు కాంట్రాక్టర్ రంగం సిద్ధం చేసుకున్నాడు. ప్రస్తుతానికి ఇదంతా స్పష్టంగా కనిపిస్తోంది. దానిపై ప్లాస్టిరింగ్ చేస్తే ఇక అంతే.. కొత్త నిర్మాణంగా కనిపిస్తుంది.

అక్కడ రూ.33 లక్షలు..
ఇక్కడ రూ.60 లక్షలు..

గతంలో డివిజన్ పరిధిలోని వీఎన్‌రెడ్డినగర్‌లో పూర్తిస్థాయిలో నిర్మించిన కల్వర్టు నిర్మాణం కేవలం రూ.33 లక్షల్లో పూర్తయితే గాంధీనగర్ కల్వర్టుకు రూ.60 లక్షల నిధులు మంజూరయ్యాయి. పాత నిర్మాణాలపై కల్వర్టు నిర్మాణం చేస్తున్నా అధికారుల్లో చలనం లేదంటే ఇదంతా వారి కనుసన్నల్లోనే జరుగుతోందని స్పష్టం అవుతోంది. లక్షల రూపాయల ప్రజాధనాన్ని దోచుకోవడానికి కుమ్మక్కైన అధికారులు, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఈ విషయంపై ఈఈ హరిలాల్‌ను వివరణ కోరగా అన్నీ సక్రమంగానే జరుగుతున్నాయంటూ కొట్టిపారేస్తున్నారు. పని మొత్తం పూర్తయిన తర్వాత చూడండి అంటూ సమాధానం ఇస్తున్నారు. ప్లాస్టిరింగ్ అయిందంటే గోడలను కలిపి కట్టిన గోడలు, ఎత్తును పెంచిన ఆనవాలు ఏమీ కనిపించవు కదా సార్ అంటే సంబంధిత ఏఈతో మాట్లాడండి అంటూ ఫోన్ కట్ చేశారు.

ఘనంగా లయన్స్ క్లబ్ ఇన్‌స్టాలేషన్ వేడుకలు



ప్రమాణ స్వీకారం చేస్తున్న లయన్స్‌క్లబ్ మీర్‌పేట్ నూతన కార్యవర్గం

కుషాయిగూడ: లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్, మీర్‌పేట్ 32వ ఇన్‌స్టాలేషన్ వేడుకలను బుధవారం హెచ్‌బీకాలనీలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన క్లబ్ అధ్యక్షుడు సంగిశెట్టి సత్యనారాయణ, సెక్రటరిగా హెచ్.ప్రభాకర్ రెడ్డి, ట్రెజరర్‌గా పి.వీరభద్రరావు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి ఉస్మానియా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ తాటికొండ వెంకటరాజయ్య ముఖ్య అతిథిగా హాజరై వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎలాంటి లాభాపేక్ష లేకుండా లయన్స్ క్లబ్ వేదికగా చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. రానున్న రోజుల్లో క్లబ్ సేవలను మరింత విస్తృతం చేయాలన్నారు. కార్యక్రమంలో క్లబ్ ఇన్‌స్టాలేషన్ అధికారులు లయన్ వి.కృష్ణప్రసాద్, ఇన్నారెడ్డి, లక్ష్మీమూర్తి, హరికృష్ణరెడ్డి, సాదు శ్యాంప్రసాద్, బి.మల్లికార్జున్, మీర్‌పేట్ క్లబ్ ప్రతినిధులు ఎస్.శ్రీనివాస్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి నిధులివ్వండి



లోకేష్‌కు వినతి పత్రం అందజేస్తున్న శాంతి సాయిజెన్‌శేఖర్

మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలోని పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ బుధవారం జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేష్‌కు జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ వినతి పత్రం అందజేశారు. వీఎస్‌టీకాలనీ, రాంరెడ్డి నగర్, కార్తికేయనగర్, రాఘవేంద్రనగర్, భవానీనగర్, సీసీ రోడ్లకు నిధులు, నాచారం ఎర్రకుంట హిందూ శ్మశానవాటికను వైకుంఠధామంగా తీర్చిదిద్దేందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు కార్పొరేటర్ తెలిపారు.

పాలిటెక్నిక్‌లో ఎంసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం

రామంతాపూర్: ప్రభుత్వ జేఎన్ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం ఎంసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైందని 650 మంది అభ్యర్థులకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించామని కళాశాల ప్రిన్సిపాల్ కౌన్సిలింగ్ కో ఆర్డినేటర్ వినయ్ కుమార్ తెలిపారు. ఉస్మానియా, జేఎన్‌టీయూహెచ్, కాకతీయ యూనివర్సిటీల పరిధిలోని ఇంజనీరింగ్ కళాశాలలోని ఏఏ బ్రాంచీల్లోని ఇంజనీరింగ్ సీట్ల వివరాలను ఎంసెట్ విభాగం పొందుపరిచిందని, ఇప్పటికీ రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులు బుధవారం నుంచి ఆప్షన్ ఇచ్చుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.



కారులోనే చంపి.. మూసీలో పడేసి..

లిఫ్ట్ మెకానిక్ హత్య కేసు నిందితుల అరెస్టు

కుషాయిగూడ: లిఫ్ట్ మెకానిక్‌ను హత్య చేసిన నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ తరలించారు. హత్యకు సంబంధించి వివరాలను బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్ వివరాలను వెల్లడించారు. మహారాష్ట్రకు చెందిన షేక్ మోసిన్ పటేల్ లిఫ్ట్ మెకానిక్. రెండు సంవత్సరాల క్రితం నగరానికి వచ్చి లిఫ్ట్‌గా మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో లిఫ్ట్ మెకానిక్‌ల వాట్సాప్ గ్రూప్‌లో సభ్యుడిగా చేరి వచ్చిన ఆర్డర్లు చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో ఏఎస్‌రావునగర్‌లో సెరా లిఫ్ట్ కంపెనీని నిర్వహిస్తున్న చీర్యాలకు చెందిన జల్లి రవికి మెకానిక్ మోసిన్ పటేల్ పరిచయమయ్యాడు. తన కంపెనీలో పనిచేయాలని నెలకు రూ.25 వేల జీతం ఒప్పందం చేసుకొని పనిలో పెట్టుకున్నాడు. వచ్చిన ఆర్డర్లకు మోసిన్ పటేల్‌ను పంపుతూ నిర్వహణ సాగిస్తున్నాడు. అయితే ఇటీవల కాలంలో రవి కస్టమర్లకు ఇచ్చే కొటేషన్ ఆర్డర్లు క్యాన్సిల్ అవుతున్నాయి. దీనిపై ఆరా తీయగా మోసిన్ పటేల్ తనకు వచ్చే కొటేషన్ల నుంచి ఫోన్ నంబర్లను సేకరించి వారికి ఫోన్ చేసి తక్కువ ధరకే పని చేస్తానంటూ కస్టమర్లను పక్కదారి పట్టిస్తున్నట్లు గుర్తించాడు. ఈ విషయంపై పలుమార్లు మందలించినా తీరు మార్చుకోకపోవడంతో అతడి అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఈ నెల 21న తన కారు డ్రైవర్ శ్రీను, శ్రీకాంత్‌రెడ్డిలను ఏఎస్‌రావునగర్ ఆఫీస్ వద్ద ఉన్న మోసిన్ పటేల్‌ను దొంగల మైసమ్మ వద్దకు తీసుకురావాలని సూచించాడు. కరీంనగర్‌లో పని ఉంది రవి సార్ రమ్మన్నాడంటూ



హత్యకేసు వివరాలను వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్

మోసిన్ పటేల్‌ను కారులో ఎక్కించుకొని దొంగల మైసమ్మ చౌరస్తా వద్దకు వెళ్లారు. యజమాని రవితో పాటు అతడి సన్నిహితుడు శేఖర్ కారులోకి ఎక్కారు. శామీర్‌పేట్ తుర్కపల్లిలో భోజనం చేయడం కోసం దాబా వద్ద కారు ఆపారు. మోసిన్ పటేల్‌కు మద్యం తాగించారు. అతడి ఫోన్ లాక్కొని రవికి చెందిన కస్టమర్లతో చేసిన చాటింగ్‌లను చూసి దాబాలోనే దాడి చేసి కారులో బలవంతంగా ఎక్కించుకొని వెళ్లారు. ఈ క్రమంలో కారులో అంతా కలిసి దాడి చేసి టవల్‌తో గొంతు నులిమి హత్య చేసి శవాన్ని బాచారం వద్ద మూసీలో పడేశారు. మరుసటి రోజు మోసిన్ పటేల్ తన వద్ద రూ.80 వేలు తీసుకొని కనిపించకుండా పోయాడని ప్రచారం చేశాడు. అప్పటికే మిస్సింగ్ కేసు నమోదు చేసిన కుషాయిగూడ పోలీసులు దర్యాప్తులో భాగంగా బుధవారం చీర్యాల వద్ద ఓనర్ రవిని అదుపులోకి తీసుకొని విచారించగా వాస్తవాలు వెలుగులోకి వచ్చినట్లు వెల్లడించారు. కేసును చేధించడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ భద్రయ, క్రైం సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

తలనొప్పితో వస్తే.. కాటికి పంపారు..

- అధిక మోతాదులో ఇంజక్షన్లు ఇవ్వడంతోనే మృతి
- మహిళ మృతిపై ఆస్పత్రి వద్ద బంధువుల ఆందోళన



కల్యాణి

మేడిపల్లి: తలనొప్పితో ఆస్పత్రిలో చేరిన మహిళకు వైద్యం అందించడంలో డాక్టర్లు, వైద్య సిబ్బంది నిర్లక్ష్యం చేయడంతో నిండు ప్రాణం పోయిందని కుటుంబసభ్యుల ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన పీర్జాదిగూడలోని అపెక్స్ ఆస్పత్రిలో చోటు చేసుకుంది. వివరాలు.. యాదాద్రి భువనగిరి జిల్లా దాతరపల్లి గ్రామానికి చెందిన కొమ్మురాజు కల్యాణి(23)ని తలనొప్పితో మేడిపల్లి అపెక్స్ ఆస్పత్రిలో చేర్పించారు. ఆమెకు వైద్యులు ఆస్పత్రిలో ఐసీయూలో చికిత్స అందిస్తున్నామని తెలిపారు. గురువారం ఉదయం గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారని కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యులు అధిక మోతాదులో ఇంజక్షన్లు ఇవ్వడంతోనే చనిపోయిందని బంధువులు అనుమానం వ్యక్తం చేశారు. తలనొప్పితో వస్తే శవంగా పంపారన్నారు. ఇలాంటి ఘటనలు జరుగుతున్నా ఉన్నతాధికారులు స్పందించడం లేదన్నారు. కల్యాణికి మూడు సంవత్సరాల పాప, 7 నెలల బాబు ఉన్నారు. తల్లి మృతితో పిల్లలు రోడ్డున పడ్డారని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు ఆస్పత్రి వారికి మద్దతుగా వచ్చి బాధితులకు రూ.6 లక్షల చెక్కు ఇప్పించారని సమాచారం.

రాష్ట్రంలో విద్యకు అధిక ప్రాధాన్యం

ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

హబ్సిగూడ: హబ్సిగూడ డివిజన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం హబ్సిగూడ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత నోట్ బుక్స్ పంపిణీ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రాష్ట్రంలో నాణ్యమైన విద్య అందించాలని సీఎం కేసీఆర్ మన ఊరు– మనబడి పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రభుదాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీందర్‌రెడ్డి, సుజాతరెడ్డి, హబ్సిగూడ రెడ్డి సంఘం అధ్యక్షుడు గాయం శ్రీధర్‌రెడ్డి, గౌరవఅధ్యక్షుడు గూడురు నరోత్తంరెడ్డి, ప్రధాన కార్యదర్శి గడ్డం మధుమోహన్‌రెడ్డి, కోశాధికారి గడ్డం సుధాకర్‌రెడ్డి, సభ్యులు ఇంద్రారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డికి వినతులు

ఏఎస్‌రావునగర్ డివిజన్ భవానీనగర్ కాలనీలో మహిళా భవన్ నిర్మించాలని బుధవారం కాలనీ అసోసియేషన్ సభ్యులు హబ్సిగూడలో ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు శ్రీరాములు, చిరంజీవి, పుల్లారావు, శ్రీనివాస్‌గుప్తా, బీఆర్ఎస్ నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఉప్పల్ డివిజన్ హనుమసాయినగర్ కాలనీలో వై జంక్షన్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌ను పక్కకు మార్చాలని, కమ్యూనిటీ హాలు నిర్మించాలని కోరుతూ కాలనీవాసులు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. కాలనీ అధ్యక్షులు హన్మంత్ రెడ్డి, శ్రీనివాస్‌ముదిరాజ్, నర్సింహాగౌడ్, అన్వర్ పాషా, వెంకట్‌రెడ్డి, జహంగీర్‌బాబు పాల్గొన్నారు.



హబ్సిగూడ ప్రభుత్వ పాఠశాలలో నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

రవాణా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



మల్లాపూర్: రవాణా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ బుధవారం ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌కు బీఆర్‌టీయూ ఆటో మోటర్ రవాణా రంగం రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య వినతి పత్రం అందజేశారు. అర్హులైన ఆటో డ్రైవర్లకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వాలని మంత్రిని ఆయన కోరారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు జి.రాంబాబు యాదవ్, ప్రధాన కార్యదర్శి పి.నారాయణ, స్కూల్ వ్యాన్ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ సీహెచ్.సాయికుమార్ ఉన్నారు.

కాషాయీకరణకు వ్యతిరేకంగా విద్యార్థులు పోరాడాలి

బోడుప్పల్: పాఠ్య పుస్తకాల్లో సిలబస్‌ను మారుస్తూ మూఢ నమ్మకాలు పెంపొందిస్తూ జరుగుతున్న విద్య, కాషాయీకరణకు వ్యతిరేకంగా విద్యార్థులు పోరాడాలని ప్రొఫెసర్లు గంటా చక్రపాణి, కాశీం అన్నారు. బోడుప్పల్ బొమ్మక్ ఆర్ కన్వెన్షన్‌లో బుధవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మూడో రోజు జరిగిన తెలంగాణ రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక, సైద్ధాంతిక రాజకీయ శిక్షణ తరగతులకు వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. సంక్షోభంలో ఉన్నత విద్యారంగం అనే అంశంపై చక్రపాణి, మతం, మతోన్మాదం, లౌకిక వాదం అనే అంశాలపై కాశీం విద్యార్థులకు బోధించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్స్‌గా ఆర్ఎస్ఎస్ వ్యక్తులను నియమించి యూనివర్సిటీలను తమ ప్రయోగాల కేంద్రంగా మార్చుకుంటున్నారన్నారు. పుస్తకాల్లో అంబేడ్కర్, భగత్‌సింగ్ చరిత్రలను తొలగించి హెగ్డేవార్, సావర్కర్‌ల పాఠాలను పెడుతున్నారని అన్నారు. శాస్త్రీయ విద్యా విధానాలను కాకుండా మూఢ నమ్మకాలను ప్రోత్సహిస్తున్నారన్నారు. విద్యా కాషాయీకరణకు వ్యతిరేకంగా విద్యార్థులు పోరాడాలని వారు పిలుపునిచ్చారు. ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు శివరామకృష్ణ, సినీ నిర్మాత, డైరెక్టర్ ఆర్.నారాయణ మూర్తి, ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఎన్ఏ స్టాలిన్, రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, ఆఫీసు బేరర్స్ రెహమాన్, నాగజ్యోతి, రఘురాం, గ్యార క్రాంతి, రాజు, ప్రవీణ్, నరేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి

మహానగరం మత సామరస్యానికి ప్రతీక



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ గోవింద్‌రెడ్డి

ఉప్పల్: మహానగరం మతసామరస్యానికి ప్రతీక అని ఉప్పల్ సీఐ గోవింద్‌రెడ్డి అన్నారు. బక్రీద్ పర్వదినోత్సవాన్ని పురస్కరించుకుని ముస్లిం మతపెద్దలతో బుధవారం ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శాంతియుత వాతావరణంలో ఉత్సవాలను జరుపుకోవాలని సూచించారు. ఎలాంటి సమస్యలు వచ్చినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని, ఒకరి మతాలను మరొకరు గౌరవించుకునే సాంప్రదాయం హైదరాబాద్ మహానగరంలో ఉందన్నారు. అందుకు నిదర్శనం, సర్వమతాల ఉత్సవాలేనని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఎస్ఐ శంకర్, మధుసూదన్ వివిధ ప్రాంతాలకు చెందిన మత పెద్దలు పాల్గొన్నారు.

కాప్రా చెరువును సందర్శించిన డీసీ

కాప్రా: జీహెచ్ఎంసీ కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఎస్.శంకర్ బుధవారం కాప్రా చెరువును సందర్శించారు. వర్షాకాలం నేపథ్యంలో నగరంలో ఉన్న చెరువుల నీటి మట్టాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించాలని మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ఆదేశించారు. మున్సిపల్ శాఖ మంత్రి, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సర్కిల్ పరిధిలోని చెరువులను సందర్శిస్తున్నట్లు డీసీ శంకర్ తెలిపారు. వర్షాకాలం నేపథ్యంలో చెరువులు నిండి లోతట్టు ప్రాంతాలకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఇరిగేషన్‌శాఖ, జీహెచ్ఎంసీ సంయుక్తంగా ఎప్పటికప్పుడు చెరువులను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. చెరువులు పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరితే వెంటనే దిగువ ప్రాంతాలకు ఇబ్బందులు లేకుండా నీటిని విడుదల చేసేందుకు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎలక్ట్రికల్ డీఈ రవీందర్, ఏఈ అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

వార్డు సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలి

కాప్రా: పాలనను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ప్రభుత్వం వార్డు కార్యాలయాలను అందుబాటులోకి తీసుకొచ్చిందని, వార్డు కార్యాలయాల్లో సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషన్ ఎన్.శంకర్ ఏఎస్‌రావునగర్‌లోని వార్డు కార్యాలయాన్ని బుధవారం సందర్శించి, ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులు, వినతిపత్రాలు, ఫిర్యాదులపై డీసీ ఆరా తీశారు. 10 రోజుల్లో కాప్రా సర్కిల్‌లోని 6 వార్డు కార్యాలయాల్లో ఫిర్యాదులు, దరఖాస్తుల రూపంలో మొత్తం 618 దరఖాస్తులు రాగా అందులో 275 దరఖాస్తులు పరిష్కారమయ్యాయని, మరో 233 పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు.

ఉప్పల్‌కు కేటీఆర్ చేసిందేమీ లేదు

ఉప్పల్: మంత్రి కేటీఆర్ ఉప్పల్‌కు వచ్చి ఉత్తర కుమార ప్రగల్భాలు పలికి వెళ్లాడని, ఆయన మాటల్లో నిజం లేదని ఉప్పల్ సర్కిల్ ఏ– బ్లాక్ అధ్యక్షుడు మందముల పరమేశ్వర్‌రెడ్డి ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం చిలుకానగర్‌లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ భరోసా యాత్రలో ఆయన మాట్లాడారు. స్థానిక నాయకులతో కలిసి డివిజన్‌లో పాదయాత్ర నిర్వహించి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ హయాంలో చేసిన అభివృద్ధిని వివరించారు. ఆయన మాట్లాడుతూ మంత్రి కేటీఆర్ అందమైన అబద్ధాలతో ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. హైదరాబాద్ నగరంలో మెట్రో రైల్ ప్రాజెక్టును తీసుకువచ్చింది కాంగ్రెస్ పార్టీ అని గుర్తుచేశారు. గ్రేటర్ ఎన్నికల సమయంలో పలు కాలనీలు, మురికి వాడలను దత్తత తీసుకుంటానని చెప్పి నేడు ముఖం చాటేయడమేమిటని ప్రశ్నించారు. కాంగ్రెస్ భరోసా యాత్రకు ప్రజల నుంచి స్పందన వస్తోందని చెప్పారు. కార్యక్రమంలో తౌఫిక్, రఘుపతిరెడ్డి, బాలరాజు, మురళిగౌడ్, కంది శ్రవణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



చిలుకానగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న పరమేశ్వర్‌రెడ్డి